

నీ వెంటే.. నేనమ్మా..

అద్వితీయంగా రాయండి!



ఆల్ ది బెస్ట్..వదలొద్దు

7

ఆల్ ది బెస్ట్.. పరీక్ష బాగా రాయాలమ్మా.. వదలొద్దు ఒక జాబ్ మనదే కావాలి.. కంగారుపడొద్దు పరీక్ష జాగ్రత్తగా రాయండి.. తదితర మాటలు గ్రూప్ -2 పరీక్షా కేంద్రాల వద్ద వినిపించాయి.. కనిపించాయి.. ఆదివారం కాకినాడలో 12 కేంద్రాల్లో గ్రూప్ పరీక్షలు నిర్వహించారు.. 9,379 మంది అభ్యర్థులకు 8,167 మంది పరీక్ష రాశారు...

భళారే..బాలకా!

చిన్నారులా మజాకానా.. ఒక వేదిక ఇచ్చి మీ ఇష్టం అంటే ఏం చేస్తారు..రెప్పవాల్చనీయకుండా.. తమ టాలెంట్‌తో కట్టిపడేస్తారు.. భళారే అని పించుకుంటారు.. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చిన్నారులు అదే చేశారు.



చిన్నారుల షో

7

అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భో..ఫోర్స్ కుంభకోణం అంత పెద్ద కుంభకోణం జరుగుతోంది.. ఇది ఈ నాటిది కాదు.. చాలా ఏళ్లగా వేళ్లూనుకుపోయింది.. అయినా ఏ ఒక్కరూ దీనిపై దృష్టి సారించినవారే లేరు.. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందించే సౌకర్యాలపై చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి స్థానానికి చేరడంతో అందరి దృష్టి ఈ ఆలయంపై పడింది.. ఇది జిల్లాకు మాయని మచ్చగా మారింది.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' నిఘా పెట్టగా అసలు విషయం బయటపడింది.. తవ్వితే బోఫోర్స్ కుంభకోణం అంతగా ఉంది.. ఇదిలా ఉండగా ర్యాంక్ మెరుగుపరిచేందుకు అన్నవరం ఆలయంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం అన్నవరం ఆలయంలో సమీక్షించేందుకు సిద్ధమయ్యారు.

అన్నవరంలో.. బో..ఫోర్స్!



4 ప్రధాన విభాగాల్లో దోపిడీ

- కంటున్నావా.. సత్యదేవా
- ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి స్థానం
- లోపమెక్కడని ఆంధ్రజ్యోతి ఆరా
- దోచుకుంటున్న దళారులు
- దర్శనమైనా..గదులైనా డబ్బులే
- మామూళ్ల మత్తులో అధికారులు
- నేడు కలెక్టర్ సమీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పనిచేసే సిబ్బందిలో చాలా మంది తమ జేబులు నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అర్చకుల నుంచి క్యూలైన్‌లో నిలబెట్టేవారు వరకూ అందరూ చేయి చాపే వారే.. చేయి తడిపితేనే దర్శనం చేయించేంతగా అవినీతి వేళ్లూనుకుపోయింది. అన్నవరం వచ్చిన భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారనే విమర్శలున్నాయి. మిగిలిన ఆలయాల్లో భక్తులు పరోక్ష దోపిడీకి గురవుతుండగా రత్నగిరికి విచ్చేసిన భక్తులు ప్రత్యక్ష దోపిడీకి గురికావడమే చివరి ర్యాంక్‌కు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం దళారీ వ్యవస్థ. ఎక్కడికక్కడే దళారులు కొంత మంది సిబ్బందితో కుమ్మక్కై భక్తులను దోచుకు తింటున్నారు. సిబ్బంది కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం జరిగే సమీక్షలో అవలోకనం చేస్తే భక్తులు సంతృప్తి చెందవచ్చు. ఇక్కడ భక్తులు ప్రత్యక్షంగా దోపిడీకి గురవుతున్నది నాలుగు విభాగాల్లో మాత్రమే.

1 దళారీ..దేముళ్లు!

స్వామివారి దర్శనాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటైన ఈ విభాగంలో దళారీ వ్యవస్థదే కీలక పాత్ర. రత్నగిరికి కార్లలో వచ్చే భక్తులనే దళారులు టార్గెట్‌గా పెట్టుకుంటారు. కారు పార్కింగ్ చేయగానే మీకు నేరుగా దర్శనం చేయిస్తామని, గర్భగుడిలో అర్చకులతో మెడలో పూలమాల వేయిస్తామని బేరసారాలు జరుపుతారు. ఒక్కొక్కరి వద్ద రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు లాగేస్తారు. బేరమయ్యాక దళారులు ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఫోన్ చేస్తారు. భక్తబృందాన్ని వారికి అప్పగిస్తారు. దర్శనం అయ్యాక ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగి డబ్బులను పంచుకుంటారు. ఈ తతంగమంతా సెక్యూరిటీ సిబ్బందికి తెలిసినా... వారు దళారీలతో ముచ్చటిస్తూ ఇంటికెళ్లే సమయంలో వారికి కొంత భాగమిస్తారు.ప్రకాష్ సదన్ కాటేజీ నుంచి పశ్చిమ రాజగోపురం వరకు అటూ ఇటూ దళారులు తిరుగుతూనే ఉంటారు.

2 చేయితడిపితేనే.. వ్రతఫలం

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తుల్లో అధిక శాతం స్వామివారి వ్రతాలు చేస్తారు. సామాన్యుల వ్రతం టిక్కెట్టు ధర రూ.300 అయితే పూర్తయ్యేసరికి మూడింతలు ఖర్చవుతుంది. టిక్కెట్టు రూ.300, వ్రతం పూజా సామగ్రి రూ.300, వ్రతం పూర్తయ్యాక పురోహితులకు దానాల రూపంలో స్వీకరించేది మరో రూ.300. ఇది కాకుండా వ్రతం అనంతరం శానిటేషన్ సిబ్బంది మూకుమ్మడిగా వ్రత మండపాల్లోకి వెళ్లి తాము స్వీపర్లమని యాచిస్తుంటారు. రత్నగిరి భక్తులు సగం ఛీత్కరించుకునేది ఇక్కడే.

ఛీ..ఆర్వో విభాగం 3

ఈ విభాగం కింద భక్తులకు వసతి గదులు కేటాయింపు జరుగుతుంది. పర్వదినాల్లో సాధారణ భక్తులకు కౌంటర్ గుమస్తాలు నరకం చూపిస్తారు. గదులు ఖాళీలు ఉన్నా సాధారణ భక్తుడికి గదులు ఇవ్వరు. అక్కడే ఉండే దళారులను సంప్రదించి కొంత అధిక మొత్తం చెల్లిస్తే మాత్రం వెంటనే గది దొరుకుతుంది. కేవలం రత్నగిరిపై 550 గదులు మాత్రమే ఉన్నాయి. సిఫార్సులు అధికం. దీంతో ఇక్కడ సామాన్య భక్తుడికి గది దొరకడం అసాధ్యం. ఇక్కడే వివాహ బృందాల దోపిడీకి దళారీ వ్యవస్థ కాచుకుని కూర్చుంటుంది. పురోహితుడు, సన్నాయిమేళం బేరం కుదుర్చుకుంటేనే వారికి లోపల ప్రవేశం ఉంటుంది. లేకుంటే అష్టకష్టాలే. దశాబ్దాలుగా ఇక్కడ దళారీ వ్యవస్థ వేళ్లూనుకుపోవడంతో ఎవరూ వారిని కదిలించలేకపోతున్నారు. వివాహ బృందాలకు స్వేచ్ఛ దొరకనివ్వకపోవడంతో దేవస్థానం అపఖ్యాతి పాలవుతోంది.

4 గలీజుల విభాగం!

భక్తుల సౌకర్యార్థం స్టాళ్లను ఏర్పాటు చేసే విభాగమే లీజుల విభాగం. దీన్ని సీ సెక్షన్‌గా పిలుస్తారు.ఇక్కడ దేవస్థానం నిర్దేశించే ధరలు అమలు జరగవు. ఉదాహరణకు సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు లైసెన్స్‌దారుడు ఒక్కో ఫోన్‌కు రూ.5 వసూలు చేయాలి ఇక్కడ రూ.10 వసూలు చేస్తాడు.ఇటీవల వినియోగదారుల కమిషన్ సైతం సదరు గుత్తేదారుపై జరిమానా వేసింది.మరోపక్క భక్తుల జోళ్ల జతకు రూ.2 వసూలు చేయాలి ఇక్కడ రూ.5 వసూలు చేస్తారు.పూజాసామగ్రి ధరలు, వివాహాలకు అవసరమైన డెకరేషన్ మండపాల ధరలు దేవస్థానం నిర్దేశించిన దానికంటే మూడింతలు ఎక్కువ.ఎక్కడా షాపుల వద్ద ధరల పట్టికలు ఉండవు. లీజుల విభాగం అధికారులు దీనిపై దృష్టిసారించరు. ఎందుకంటే మామూళ్ల మత్తు.ఎంఆర్‌పీ ధరలతో విక్రయాలు జరగవు. మామూళ్ల మత్తులో అధికారులు ఊగుతుండడం దౌర్భాగ్యంగా పేర్కొనవచ్చు.



చిత్రాడలో ఎస్‌బీ లే-అవుట్‌ను పరిశీలించి చర్చిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు

జనసేన ఫస్ట్ షో

- మార్చి 14న జనసేన ప్లీనరీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సమావేశం
- అధినేత పవన్ దిశానిర్దేశం
- చిత్రాడలో వేదిక ఖరారు
- ఒకే రోజు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న నేతలు

పిఠాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన ప్లీనరీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. మార్చి 14న జనసేన ప్లీనరీని పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించాలని ఇప్పటికే పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీ నూరుశాతం స్ట్రైక్‌రేట్‌తో అధికారంలోకి రావడం.. అధికారంలో భాగస్వామ్యమైన తర్వాత తొలి ప్లీనరీ కావడంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ ప్లీనరీకి ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి జనసైనికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.ఈ మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో 216వ జాతీయ రహదారి చెంతనే ఉన్న 80ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు లేఅవుట్ (ఎస్‌బీ సిటీ) జనసేన ప్లీనరీకి వేదిక కానుంది. ఉదయం ప్లీనరీ సమావేశాలతో పాటు సాయంత్రం ఇక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నారు.వాహనాల పార్కింగ్, వచ్చే నాయకులు, ముఖ్యఅతిథులు, కార్యకర్తలు భోజనాలు చేసేందుకు అనువైన ప్రాంతంగా దీన్ని గుర్తించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు జనసేనలోని ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. అక్కడ ఏ విధమైన ఏర్పాట్లు చేయాలన్న అంశంపై పార్టీ నాయకులు పరిశీలన జరిపారు. గతంలో మాదిరిగా మూడు రోజులు కాకుండా ఒకే రోజు ప్లీనరీ కావడంతో అక్కడే ఉదయం పార్టీ ప్రతినిధుల సమావేశం, సాయంత్రం బహిరంగ సభ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పార్టీ రాష్ట్ర నేతలు మరోమారు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.. ప్లీనరీ వేదికను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు,గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, రాజమహేంద్రవరం జనసేన అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ఇతర నాయకులు పరిశీలించారు. ప్లీనరీ, బహిరంగ సభల నిర్వహణ, వాహనాల పార్కింగ్ తదితరాలకు అక్కడ ఉన్న ప్రదేశం ఎంత వరకూ సరిపోతుందనే అంశంపై అంచనాలు వేశారు. నెలాఖరు లేదా మార్చి 1న పార్టీ ముఖ్యనేతలు పిఠాపురం వస్తున్నట్టు సమాచారం. వీరు వచ్చి పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకున్న తర్వాత ఏర్పాట్లు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని రాజమహేంద్రవం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. రాజమహేంద్రవరంలో కేంద్ర బడ్జెట్‌పై ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం పాల్గొన్నారు.కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. దీనిపై పురందేశ్వరి స్పందిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల ఎన్నో కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. ఇవన్నీ కొనసాగాలంటే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలి

రైతులకు ఢిల్లీరావు సూచన

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ కాస్తో కూస్తో ప్రకృతి వ్యవసాయం చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి యాజమాన్య పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. వర్మి కంపోస్టు వినియోగించి పండిస్తున్న అరటి, బొప్పాయి, చెరకు, నువ్వులు, మొక్కజొన్న పంటలను చూశారు.ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, కోఆర్డినేటర్ తాతారావు, జిల్లా హార్టికల్చర్ అధికారి పి.సుజాతకుమారి, వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

గోదారమ్మ ఎక్కడ.. శివయ్యా!



అధికారులు గత నెల రోజులుగా శివరాత్రిపై సమీక్షలు చేస్తున్నారు.. అయితే నేటికీ ఏర్పాట్లు మాత్రం చేయలేదు.. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' గోదావరి రేవులను పరిశీలించగా ఇలా అధ్వానంగా దర్శన మిచ్చాయి.. ఇక ఏర్పాట్లు ఎప్పుడు.. ఎలా చేస్తారో చూస్తారో చూడాల్సిందే మరి..!

రేవులు చూస్తే ఇలా.. ఏర్పాట్లు లేవే అసలా?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

శివ..శివా.. ఎంత కష్టం వచ్చింది.. రేపు లేదు.. ఎల్లుండే శివరాత్రి.. రేవులు చూస్తే శివరాత్రికి గోదావర్రీ తప్పేటట్టు లేదు.. ఎందుకంటే గోదావరి రేవులు నీళ్ల లేక వెలవెల బోతున్నాయి.. మెట్ల దగ్గరగా కూడా నీళ్ల లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల మాత్రం రేవుల అపరిశుభ్రంగా ఉన్నాయి. శివరాత్రికి గోదావరి స్నానం చేసి స్వామి దర్శనం చేసుకోవాలనేది భక్తులు నమ్మకం. అయితే శివరాత్రికి అఖండ గోదావరిలో స్నానమాచరించే పరిస్థితి కానరావడంలేదు. శివరాత్రికి జిల్లాలోని రాజమహేంద్రవరంలో ఉన్న కోటిలింగాల ఘాట్, పుష్కరఘాట్, గౌతమిఘాట్, ధవళేశ్వరం రామపాదాల రేవులకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. కోటి లింగాల ఘాట్‌కు ముందు రోజు రాత్రి అంటే మంగళవారం రాత్రి నుంచి దూర ప్రాంతాల భక్తులు కాలినడకన చేరుకోవడం ఆనవాయితీ.. ఆ రోజున ఈ రేవులో సుమారు లక్ష మంది వరకూ స్నానాలు ఆచరిస్తారు. శివరాత్రి రోజున పుణ్య స్నానాలకు ఎంత ప్రాముఖ్యం ఉందో..పిండప్రదానాలకూ అంతే ప్రాధాన్యం ఉంది. అయితే.. కోటిలింగాల ఘాట్, గణపతి, దుర్గ, పుష్కర, మార్కండేయ, డోబీ, వీఐపీ ఘాట్లలో ఎక్కడా నదిలో స్నానం చేయడానికి అనుకూలంగా నీళ్లు లేవు. కొన్ని ఘాట్లలో అసలు నదిలో కాలు పెట్టడానికి లేకుండా నాచు పేరుకుపోయింది. గత పుష్కరాలకు దేశంలోనే అతి పెద్దదిగా కోటిలింగాల ఘాట్‌ను 1500 మీటర్ల నిడివితో విస్తరించారు. కానీ ఇక్కడ కూడా

- ఎల్లుండే మహా శివరాత్రి
- అధ్వానంగా గోదావరి రేవులు
- అధికారులు చూసినా ఇంతే
- రేవుల చెంత కానరాని నీళ్లు
- లోపలకు దిగితేనే స్నానాలు
- మురికిగా కనిపిస్తున్న వైనం
- రాజమండ్రి,కొవ్వూరులో ఇంతే
- ఏర్పాట్లకు నిధుల్లేవట?
- భక్తులకు తప్పని ఇబ్బందులే

ఇప్పుడు నదిలో స్నానం చేసే పరిస్థితి లేదు. నదిలో బురద పేరుకుపోవడంతో అసలు కాలు పెట్టడానికి వీల్లేకుండా ఉంది. దీంతో మెట్లపైన జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారమే శివరాత్రి అయినా నేటికీ ఏర్పాట్లు పూర్తి కాలేదు.ఘాట్లలో సౌకర్యాలను కార్పొరేషన్ చేస్తుండగా, భద్రతాపరంగా పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది. కార్పొరేషన్, పోలీస్ వద్ద ఉన్న డ్రోన్లను రంగంలోకి దింపుతున్నారు. ఇప్పుడు శివరాత్రికి చేసే ఏర్పాట్ల అనుభవం పుష్కరాలకు పని చేస్తుందని భావిస్తున్నారు. కానీ ప్రస్తుతం పుష్కరఘాట్ మినహా మరెక్కడా నదిలో స్నానం చేసే వీల్లేకుండా ఘాట్లు ఉన్నాయి. దీంతో ఏ మాత్రం ఏర్పాట్లతో అలసత్వం కనిపించినా తొక్కిసలాట జరిగే అవకాశం కూడా ఉంది.



రాజమహేంద్రవరంలో మురికిగా ఉన్న గోదావరి నీరు

అధ్వానంగా గోష్పాదక్షేత్రం

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు నాచుపట్టి ఉన్నాయి.శివరాత్రికి సుమారు 25 వేల మంది గోదావరి పుణ్యస్నానాలకు వస్తుంటారు.బుధవారమే శివరాత్రి అయినా ఇంకా ఏర్పాట్లు చేయలేదు..గోష్పాదక్షేత్రం ఆవరణ అధ్వానంగా ఉంది. గతంలో పచ్చదనంతో నిండి ఉండే రావిచెట్లు కొట్టేసిన తర్వాత క్షేత్రం కళోపోయింది.ఆ చెట్టు కింద ఉండే దేవతా విగ్రహాలు పక్షుల రెట్టలతో నిండిపోయాయి. కనీసం వాటిని పట్టించుకునేవారే లేరు..ఇక చెట్టు ఉండే దిమ్మకూడా ముక్కలైపోయింది.అధికారులు వస్తున్నారు. వెళుతున్నారు తప్పితే ఏర్పాట్లు ఏం చేస్తారనేది మాత్రం చెప్పడం లేదు..శనివారం ఆర్‌డీవో రాణి సుస్మిత ఘాట్‌ను పరిశీలించి వెళ్లారు. ఇక మిగిలింది రెండు రోజులే హడావుడిగా ఏం చేస్తారో చూడాల్సిందే..మెట్లపై పట్టిన నాచుని పూర్తిగా తొలగించి, ఇసుక వేయించాలని భక్తులు కోరుతున్నారు. క్షేత్రంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వశాఖల అధికారులు తమ వద్ద నిధులు లేవంటూ బదులివ్వడం కొసమెరుపు. ఉన్నతాధికారులు స్పందించి శివరాత్రికి నిధులు కేటాయించాల్సి ఉంది.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అధ్వానంగా ఉన్న స్నానాలరేవు

పట్టిసీమకు గోదారి

సీతానగరం,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ వెళ్లి వీరేశ్వరుడిని దర్శించుకోవాలనుందా.. అయితే కొవ్వూరు మీదుగానే వెళ్లా ల్సిన అవసరం లేదు.. మరో దారి కడా ఉందండోయ్.. సీతానగరం మండలం వంగలపూడి ర్యాంపు నుంచి ప్రతీ ఏడాది దారి వేస్తారు. ఈ ఏడాది కూడా దారి వేశారు. ఈ ప్రయాణం చాలా ప్రత్యేకం.. ఏజెన్సీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ దారి గుండా వెళతారు. పూర్వం నుంచి గోదారి ఉంది. నేటికీ అదికారులు ఏర్పాట్లు చేస్తారు. ఏలూరు జిల్లా పట్టిసం వీరభద్రడిని దర్శించుకోవాలనుకేనే భక్తుల కోసం గోదావరి పాయకు అడ్డంగా ఇసుకతో రోడ్డు వేస్తున్నారు.వంగలపూడి ర్యాంపు మీదుఆ అక్కడికి చేరుకోవచ్చు.



వంగలపూడి నుంచి పట్టిసీమకు గోదావరిలో ఇసుకతో ప్రత్యేకంగా వేస్తున్న దారి

భళా బాల!

● ఉత్సాహంగా చిన్నారుల రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక పోటీలు

● రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన చిన్నారులు


కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన మూకీ ప్రదర్శన


చిన్నారుల జానపద నృత్యం


విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాటికలు, చిన్నారుల ఏకపాత్రాభినయాలు, జానపద నృత్యాలతోచే సిన సందళ్లు.. చిత్రలేఖనంతో ఆకట్టుకునేలా గీసిన చిత్రాలు.. సందేశాత్మక నాటికలతో ప్రేక్షకుల మెప్పు పొందుతూ సాగిన చిన్నారుల రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అబ్బురపరిచాయి. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీలను ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, కార్యదర్శి పీవీ రావు, కార్యక్రమాల నిర్వాహకులు నాదెళ్ల ప్రభుదాసు, ఎంవీ రమణ తదితరులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు.

అనంతరం దంటు భాస్కరరావు, పీవీ రావులు చిన్నారులనుద్దేశించి మాట్లాడుతూ చిన్నారులను రంగస్థల కళవైపు ఆకర్షితుల్ని చేయడం ద్వారా కళారంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులను చిత్రసీమకు అందజేసిన ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం పోటీలు, నాటికల ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయం 8.30గంటల నుంచి ప్రారంభమైన నాటికల పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా ది బ్లూక్రస్ట్ పాఠశాల కాకినాడ వారి తెనాలి రామకృష్ణ నాటిక, ఇంద్రపాలెం ఉషోదయ మెరిట్ స్కూల్ వారి అనుసరణ నాటిక, తిమ్మాపురం శారదా విద్యాలయం వారి సోషల్ మీడియా నాటిక, అడ్డంగడి ఎంపీయూపీ పాఠశాల వారి భిన్నత్వంలో ఏకత్వం నాటిక, ఉప్పాడ కొత్తపల్లి వీవీఎస్ హైస్కూల్ వారి ఆడపిల్లలను పుట్టనిద్దాం నాటిక తామరాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ వారి మాతృదేవో భవ నాటిక, పిఠాపురం శ్రీదర్శ హైస్కూల్ వారి ఏరువాక నాటిక, కోటనందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వారి నేరం ఎవరిది నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అతిథులుగా డీవీ శివకుమార్(బెహెరెన్), పట్నాల రాము, కేవీఎస్ సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావు, వాసు, మార్ని జానకిరామ్చౌదరి, గౌరీనాయుడు, సురభిశారద తదితరులు పాల్గొన్నారు. చిన్నారులను కళలు, రంగస్థల ప్రదర్శనల వైపు ప్రోత్సహించేందుకు నాటికల ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. నాటికల ప్రదర్శనలు చూసేందుకు వచ్చిన చిన్నారులతో దంటు కళాక్షేత్రం సందడిగా మారింది.

ఉత్సాహభరితంగా క్రీడాపోటీలు



● ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఆదివారం విజేతల వివరాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం ఏడు మ్యాచ్లు జరిగాయి. డీఎస్డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

హిమాచల్ప్రదేశ్, కేరళ సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో హిమాచల్ప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు 4-1 తేడాతో విజయం సాధించింది. తెలంగాణ, మహ రాష్ట్ర సెక్రిటేయట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో మహారాష్ట్ర సెక్రటేరియట్ 10-2 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్లో ఒడిస్సా 5-1 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చెన్నై ఆర్ఎస్బీ చండీఘర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో ఆర్ఎస్బీ చెన్నై 4-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో గెలిచింది. చత్తీస్ఘడ్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో చత్తీస్ఘడ్ 7-1 తేడాతో విజయం సాధించింది. మధ్యప్రదేశ్, కేరళ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో కేరళ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది.


గెలిచిన కేరళ టీం


హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు


గెలిచిన కేరళ టీం ఆనందంతో డ్యాన్స్

దివాన్చెరువు ఫ్లైఓవర్కు లైన్క్లియర్

● 2.55 కిలోమీటర్ల దూరం

● రూ.327 కోట్లు అంచనా వ్యయం

రాజమహేంద్రవరంఅర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు 16(హౌరా-చెన్నయ్)- 216ఏ (గుండుగొలను-కొవ్వూరు-గామన్ ఇండియా వంతెన)ల ను కలుపుతూ దివాన్చెరువు సెంటర్లో ఫ్లైఓవర్కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. గామన్ వంతెన జంక్షన్-దివాన్చెరువు జంక్షన్-ఫ్రూట్ మార్కెట్ సెంటర్ను కలుపుతూ ఈ ఫ్లైఓవర్ను నిర్మించనున్నారు. మొత్తం రూ.2.55 కిలోమీటర్ల దూరం, రూ.327 కోట్ల అంచనా వ్యయంతో చేపడతారు. ఈమేరకు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అనుమతులు మంజూరు చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్కు గ్రీన్సిగ్నల్ లభించింది. దివాన్చెరువు వద్ద ఫ్లైఓవర్ ఆవశ్యకతను తెలియజేస్తూ గత ఏడాది జూలైలోనే ఎంపీ పురందేశ్వరి కేంద్ర మంత్రి నితిన్గడ్కరీకి లేఖ రాశారు. గామన్ వంతెనపై ట్రాఫిక్ విపరీతంగా పెరగడంవల్ల దివాన్చెరువు సెంటర్లో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొంటూ తక్షణమే ఫ్లై ఓవర్ మంజూరు చేయాలని ఆ లేఖలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం దివాన్చెరువు సెంటర్లో ఫ్లైఓవర్కు అనుమతులు మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చిలో దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వికసిత భారత్ టార్గెట్

● కేంద్ర బడ్జెట్పై మేథావుల సదస్సులో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బడ్జెట్పై ఆదివారం నిర్వహించిన మేథావుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు, యువత, రైతులు, పెట్టుబడులు ప్రధాన అంశాలుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ తయారు చేశారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. దీనికనుగుణంగా రూ.50 లక్షల 50 వేల కోట్లకుపైగా కేంద్రబడ్జెట్ ఉందన్నారు. డాక్టర్ అంబేద్కర్ను గౌరవించడమే కాకుండా ఆయన ఆలోచనలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బడ్జెట్లో యువతకు కేటాయింపులు పెంచారని, ఇప్పటికీ దేశంలో 55శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సాయి హాస్పటల్స్ అధినేత డాక్టర్ విజయకుమార్, క్రెడాయ్ ప్రతినిధి బుడ్డిగ శ్రీనివాస్, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, బీజేపీ నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, కంటిపూడి సర్వారాయుడు, బొమ్ముల దత్తు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, నీరుకొండ వీరన్నచౌదరి, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి, పాల్గొన్న వివిధ వర్గాల ప్రముఖులు, బీజేపీ నాయకులు

సహజ వనరులపై ఆంధ్రులకే హక్కు

● కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్

● మన గ్యాస్, మన చమురు-ఆంధ్రుల హక్కు అంశంపై సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కృష్ణ, గోదావరి బేసిన్లో లభ్య మవుతున్న గ్యాస్, చమురుతదితర సహజ వనరులపై ఆంధ్రులకే హక్కు ఉంటుందని, రూ.లక్షల కోట్ల విలువైన సహజ సంపదను కార్పొరేట్ సంస్థలు దోచుకుపోతున్నాయని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహాదేవ్ మండిపడ్డారు. కాకినాడ గాంధీభవన్లో ఆదివారం మన గ్యాస్, మన చమురు ఆంధ్రుల హక్కు నినాదంతో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహాదేవ్ మాట్లాడుతూ కేజీ బేసిన్లో బొంబాయ్ కంటే చమురు నిల్వలు అత్యధికంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు క్షేత్రం ఆంధ్రప్రదేశ్లో ఉందన్నారు. ఇక్కడి నుంచి రూ.60లక్షల కోట్ల విలువైన చమురు నిల్వలను కార్పొరేట్ సంస్థలు తరలించుకుపోతున్నా యన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 38, 39బి ప్రకారం సహజ వనరులు ఏ ప్రాంతలో వెలికితీసినా ఆ ప్రాంత అభివృద్ధికి 30శాతం ఖర్చుచేయాలని ఉన్నప్పటికీ ఆచరణలో శూన్యంగా ఉందన్నారు. ఇదే విధంగా కొనసాగితే కోనసీమ ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల భూముల్లో పంటలు పండకుండా ఉప్పు భూములుగా మారిపోతాయన్నారు. సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సహజ వనరుల పరిరక్షణకోసం ఈ సదస్సు ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో ఇది అతి పెద్దఉప్పెనగా మారుతుందన్నారు. నేడు కాకినాడలో కూడా పెద్ద భవనం కడితే అది భూమిలో కూరుకుపోతుందనే భయంతో ప్రజలు ఉన్నారన్నారు. సభాధ్యక్షుడు ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంత వాసులకు ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా రాష్ట్ర సహజ వనరులను తరలించుకుపోతున్నారన్నారు. సామాజికవేత్త అక్కినేని వనజ, న్యాయవాది జవహర్ అలీ మాట్లాడుతూ యువత అవగాహన కలిగి సహజ సంపదను కాపాడుకునే విధంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు డేగ ప్రభాకర్, రాష్ట్ర బీకేఎంయు కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు కామిరెడ్డి బోడకొండ, వాసిరెడ్డి ఏసుదాసు, తోకల ప్రసాద్, పప్పు ఆదినారాయణ, కోనాల భీమారావు, పెదిరెడ్ల సత్యనారాయణ, టి.అన్నవరం కె.కిషోర్, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీజే సౌండ్స్ ఆపడంతో పోలీసులపై దాడి

● కొమరిపాలెంలో ముగ్గురి అరెస్టు, రిమాండ్

బిక్కవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో గస్తీ తిరుగుతున్న ఇద్దరు పోలీసులపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. తమ పోలీస్స్టేషన్కు సంబంధించిన హోంగార్డు ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ జీపులో పందలపాక, ఊల పల్లి మీదుగా కొమరిపాలెం గస్తీ తిరుగుతుండగా కొమరిపాలెంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో హరిజనపేటలో డీజే సౌండ్స్ వినబడడంతో అక్కడకు వెళ్లి సౌండ్స్ ఆపివేయించారు. దీంతో అక్కడ మద్యం తాగుతున్న నూతిక అజయ్, లంక మధు, రాయుడు ప్రదీప్ మాపేటలోకి వచ్చి సౌండ్స్ ఆపుతారా అంటూ హోంగార్డు ప్రకాష్ చేతిలోని లాఠీ తీసుకుని అతన్ని కొట్టి కింద పడవేశారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ వెళ్లగా అత న్ని కూడా కొట్టి లాఠీ విరగ్గొట్టి, చొక్కా చింపేసి సెల్ఫోన్ లాక్కుని అతడిని పక్కనున్న డ్రైనేజీలో పడవేశారు. ఈ ఘటనలో గాయాల పాలైన పోలీసులిద్దరూ అనపర్తి ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఫిర్యాదు చేయగా ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. అనపర్తి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్ఐ వివరించారు.

సైబర్మోసం

● రూ.10 లక్షలు హుష్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని టి.నగర్కి చెందిన ఆదిత్య శ్రీకాంత్ హెచ్డీఎఫ్సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. గత డిసెంబరు నెలలో టెలిగ్రాం ద్వారా ఓ ఫైనాన్స్ కంపెనీ లింక్ వచ్చింది. తమ వద్ద పెట్టుబడి పెడితే రెట్టింపు సొమ్ము వస్తుందని నమ్మించారు. దీంతో దఫదఫాలుగా శ్రీకాంత్ పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టాడు. రూ.10లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆ కంపెనీ యాప్ పని చేయడంలేదని, తాను మోసపోయానని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

● రూ.1,26,290 స్వాధీనం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం చీడిగ పేకాట స్థావరంపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,26,290 స్వాధీనం చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. 10మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


కాకినాడలో గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు

● కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో 12 కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. 12 కేంద్రాల్లో ఉదయం 9379 మంది అభ్యర్థులకుగాను 8167 మంది అభ్యర్థులు హాజరుకాగా, 1212మంది పరీక్షకు హాజరు కాలేదు. 86.06 శాతం నమోదైంది. మధ్యాహ్నం 9379మంది అభ్యర్థులకుగాను 8163మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా 1216 మంది హాజరు కాలేదు. 85.94శాతం నమోదైంది. ఏపీపీఎస్సీ మెంబర్ సోనీవుడ్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు జేఎన్టీయూ కాకినాడ కేంద్రాలను తనిఖీచేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.


పరీక్షా కేంద్రానికి పరుగెడుతున్న అభ్యర్థి



పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం, పరీక్షా కేంద్రం వద్ద కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ప్రత్యేకం

● వేటకథల సదస్సులో వక్తలు

యానాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ఎంతో ప్రత్యేకమైనవని కొంత మంది కథకులు అద్భుతమైన వేటకథలు రాశారని పలువురు వక్తలు అన్నారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు వేటకథలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని వక్తలు వివరించారు. ఆదివారం ఉదయం స్థానిక సర్వశిక్షఅభియాన్ సమావేశపు హాలులో సాహిత్య అకాడామీ- స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్త నిర్వహణలో వేటకథలు-సదస్సు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి సాహిత్య అకాడమీ సభ్యులు చింతకింది శ్రీనివాసరావు ప్రారంభసభకు స్వాగతోపన్యాశం పలుకులు వేటకథలుపై ఏ భాషలోను ప్రత్యేక సదస్సు జరగలేదని తెలిపారు. వేటకథలుపై అకాడమీ, స్ఫూర్తి సాహితీ సంస్థ ద్వారా యా నాంలో నిర్వహించిన సదస్సుకు ఏంతో విశిష్టత ఉందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్ఎ మునిస్వామి మాట్లాడుతూ ఇంతమంది సాహితీవేత్తలతో యానాం సాహిత్యసదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలుగుభాష ఎంతో సుందరమైనదన్నారు. అనంతరం సాహిత్య అకాడమీ తెలుగుసలహా సంఘం కన్వీనర్ రచయిత్రి సి.మృణాళిని అధ్యక్షోపన్యాసం చేశారు. మనిషికి జంతువులకు అనుబంధం. అలాగే మనిషికి మనిషికి మధ్య సంబంధాలను వేటకథలు విశ్లేశిస్తాయన్నారు. గౌరవ అతిథి స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ ప్రత్యేకంగా వేటకథలు సదస్సు నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. వేట కథలకు ఇంతమంది సాహితీవేత్తలతో సదస్సు జరగడం ఇదే ప్రథమంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభసభకు కథకుడు రత్నాకర్ పెనుమాక వందన సమర్పణ చేశారు. అనంతరం నిర్వహించిన మొదటి సదస్సుకు యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వాసిరెడ్డి నవీన్ అల్లం శేషగిరిరావు కథలపై మాట్లాడారు. వేటకథలు అద్భుతంగా రాసిన కథకుల్లో అల్లం శేషగిరిరావు ప్రముఖంగా నిలుస్తారని అన్నారు. ఆయన రాసిన కథల్లో ఒకటైన చీకటి కథ గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ కథలో ఎన్నో లేర్లు ఉంటాయని ఒక్కొక్క లేరు జీవితంలో చీకటి గురించి, సమాజంలో చీకటి గురించి గొప్పగా రాసిన కథ అన్నారు. జేపీ వైద్య కథలపై ప్రముఖ కవి అవధానుల మణిబాబు మాట్లాడారు. ఆ కథల్లో ప్రస్తావించిన అంశాలను వివరించారు. రెండో సదస్సుకు కాళ్లకూరి శైలజ అధ్యక్షత వహించి మాట్లాడారు. జె.నీరజ పతంజలి కథలు గురించి మాట్లాడారు. జంతువులను వేటాడటం కాదని జంతువులా మారుతున్న మనిషిని వేటాడాల్సిన పరిస్థితులపై పతంజలి ఆందోళన వక్తంచేస్తారన్నారు. ఆయన కథలు ఎంతో ఆలోచనాత్మకంగా లోతైన అంశాలతో ఉంటాయన్నారు. ఎస్వీ రంగారావు, ఇతర రచయితల వేట కథలపై ప్రముఖకవి, కథకుడు అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. వేటలో ఎన్నో రకాలు ఉన్నా యన్నారు. రాజుల వేట అలాగే గిరిజనులు చేసే వేట, సముద్రంలో చేసే వేట ప్రపంచీకరణ నేపథ్యంలో అంశాలను వివరించారు. పూసపాటి కృష్ణంరాజు కథలపై మందలపర్తి కిశోర్ మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి, మాకినీడి సూర్యభాస్కర్, మోకా రత్నరాజు, చింతాకొండలరావు, పోనుగుమట్ల అశోక్కుమార్ పాల్గొన్నారు. సాహిత్య అకాడమీ ఇన్చార్జి టీఎస్ చంద్రశేఖరన్ సదస్సునుపర్యవేక్షించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు


దర్శనంకోసం బారులు తీరిన భక్తులు


సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

● రూ.50 లక్షల ఆదాయం

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవుదినం కావడంతోపాటుగా దశమి, ఏకాదశి పర్వదినం, మాఘమాసంలో చివరి వివాహ ముహూర్తం కావడంతో వివాహాలు చేసుకున్న జంటలతో ఈ రద్దీ నెలకొంది. ఉచిత దర్శనానికి మూడుగంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు సమయం భక్తులు వేచి ఉన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.200 అంత్రాలయ దర్శన టిక్కెట్లను నిలుపుదలచేసి శీఘ్రదర్శనానికి మాత్రమే అనుమతించారు. ఆలయ ఈవో సుబ్బారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 4 వేల వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 4500 మందికి అన్నప్రసాద వితరణ గావించారు.

భయపెడుతున్న మోడులు

» గోకవరం-జగ్గంపేట రహదారిని ఆనుకుని ఎండిపోయి ఉన్న చెట్లు



గోకవరం-జగ్గంపేట రహదారిని ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్లు



» వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

గోకవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గోకవరం-జగ్గంపేట ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఎండిన వృక్షాలు వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నిత్యం ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అటు కాకినాడతో పాటు, ఏజెన్సీ ప్రాంతాలైన గంగవరం, అడ్డతీగల తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా, ఇటు గోకవరం చేరుకోవాలన్నా ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి ఉంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న రోడ్డును ఆనుకొని అక్కడక్కడ భారీ వృక్షాలు ఎంతోకాలం నుంచి ఎండిపోయి ప్రయాణికులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఎండిన చెట్ల కొమ్మలు అప్పుడప్పుడు విరిగి పడుతుండడంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదవశాత్తూ చెట్టు కొమ్మ పడితే ఎంతటి భారీ వాహనమైన మరమ్మతుకు గురయ్యే పరిస్థితి ప్రస్తుతం ఇక్కడ పొంచి ఉంది. సంబంధిత అధికారులు ప్రమాదాలు జరగక ముందే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా తనుకు వారి సత్తెమ్మ జాతర



బిక్కవోలులో సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో తనుకు వంశీకుల ఇలవేల్పు సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకొకసారి ఈ జాతరను మూడు రోజులు పాటు నిర్వహిస్తారు. మొదటి రోజు పంబనాదపు కళాకారులు అమ్మవారి చరిత్రను వివరించగా, రెండో రోజు ఘట రూపంలో వున్న అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఉత్సవంలో అమ్మవారి వేషధారి ఇచ్చిన బియ్యాన్ని వండుకుని తింటే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. మూడో రోజు తమ కోర్కెల సిద్ధికై అమ్మవారి ప్రతిష్ఠ స్థానంలో గత ఏడాది పాతిపెట్టిన నాణాలను భక్తులు చేజిక్కించుకుని మరలా కొత్త నాణాలు పాతడం ఆనవాయితీ. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు శాఖాహారంతోను, రాత్రి మాంసాహారంతో అన్నప్రసాదాన్ని అందించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తనుకు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో పాళాలమ్మ ఆలయ శంకుస్థాపన

కోరుకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపవరం ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని గ్రామదేవత పాళాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచ్చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణం త్వరగా పూర్తికావాలని అందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, జనసేన మండలాధ్యక్షుడు బదిరెడ్డి దొర, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో కోర్టు ఒకరికి జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ డీఎస్పీ(ఇంచార్జి) రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 18 మందిపై కేసులు నమోదు చేశారు. విచారణ అనంతరం 17 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేటు సి.రమ్య తీర్పు చెప్పారని డీఎస్పీ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల వారితోపాటు ఎదుటి వారికీ ప్రమాదకరమన్నారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో ప్రతి రోజూ వివిధ ప్రదేశాల్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనదారులు బాధ్యతగా భావించాలన్నారు. హెల్మెట్‌పై కూడా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని రమేశ్‌బాబు వెల్లడించారు.

వెయ్యి మందితో విష్ణు సహస్ర లలితా పారాయణం



విష్ణు సహస్ర లలితా పారాయణంలో పాల్గొన్న భక్తులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి): పిల్లలకు భగవంతుడి పేర్లు పెట్టుకోవడంలో ఆంతర్యం నిత్య భగవన్నామ స్మరణ చేయడానికేనని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు కలవకొలను శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో 1000 మందితో ఆదివారం విష్ణు సహస్ర లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఒత్తిడిని జయించాలంటే భగవన్నామమొక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ, డాక్టర్ కె.అనూరాధ, అజ్జరపు వాసు, కులకర్ణి చంద్రశేఖర్, టి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

పదో తరగతి రాష్ట్ర స్థాయి మోడల్ పరీక్ష



మోడల్ పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

రాజానగరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాజానగరంలోని దివ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి పదో తరగతి అబ్జెక్టివ్ మోడల్ పరీక్షను నిర్వహించారు. దివ్య విద్యాసంస్థల చైర్మన్ బర్ల విజయ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పరీక్షలకు రాజానగరంతో పాటు పరిసర గ్రామాల్లోని సుమారు 786 మంది పదో తరగతి విద్యార్థులు హాజరైనట్టు విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈపరీక్షలు దోహదపడతాయన్నారు. ఈపరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో రామచంద్రరావు, ప్రిన్సిపాల్ వీరభద్రం, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామాలయం సెంటర్లోని రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్స్ బిల్డింగ్‌లో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి ఇమ్మని వెంకట్ మాట్లాడారు. రోటరీ క్లబ్ 1905 ఫిబ్రవరి 23న అమెరికా చికాగో నగరంలో ఫాల్ హరీష్ అనే న్యాయవాది స్థాపించారన్నారు. ప్రస్తుతం 220 దేశాల్లో రొటేరియన్లు మానవాళికి సేవలందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహ్మద్ అబ్దుల్లా సహకారంతో జాంపేట పోలీస్ గ్రౌండ్స్‌లో ఈనెల 7న ప్రారంభమైన రంజాన్ కప్ 2025 టోర్నమెంట్ సీజన్ 3 ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎమ్మెల్యే విచ్చేసి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పురుష ఓటర్లే అధికం

» రాజానగరంలో 2,522మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
» పురుషులు 1635 మంది
» మహిళా ఓటర్లు 887 మంది
» ముమ్మరంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు పోలింగ్ జరిగేందుకు కొద్దిరోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో మండలంలోని గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. కూటమి పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం తరపున కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ముఖ్యంగా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యే బత్తుల సతీమణి వెంకటలక్ష్మి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే కరపత్రాలను, బ్యాలెట్ నమూనా పత్రాలను ఓటర్లుకు ఇచ్చి శాసనమండలికి ఓటు ఏ విధంగా వేయాలో చైతన్యపరుస్తున్నారు. అలాగే కొంతమంది అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. కూటమి అభ్యర్థి రాజశేఖరంతోబాటు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ సాంకేతికతను బాగా ఉపయోగించుకుని ఎన్నికల ప్రచారం చేసుకోవడంలో ముందున్నారు.. కాగా రాజానగరం మండలంలో పట్టభద్రుల ఓటర్లను పరిశీలిస్తే వారిలో మహిళా ఓటర్లు కన్నా పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. మండలంలోని మొత్తం 2,522మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా వారిలో 1635 మంది పురుషులు కాగా 887 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.



ప్రతీసారి ఓటు నమోదేనా?

శాసన మండలి ఎన్నికల్లో ఓటుహక్కు నమోదుకు ప్రతీసారి దరఖాస్తు చేసుకోమని అధికార్లు చెబుతుండడంపై కొంతమంది పట్టభద్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ఓటరు జాబితా వలె ఈ ఎమ్మెల్సీ ఓటర్లు జాబితా కూడా కొనసాగిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతీ సారి మండలి ఎన్నికలకు ముందు ఓటరు నమోదుచేసుకోవాలన్న నిబంధనపై ఎంత ప్రచారం జరిగినా నిర్ణీత గడువులోగా దరఖాస్తుల సమర్పణకు వివిధ కారణాల వల్ల వీలుకాకపోవడం, అవగాహనా లోపం వంటి వాటివల్ల ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోతున్నామని కొందరు వాపోతున్నారు. పాత ఓటరు జాబితాలను కొనసాగించి మండలి ఎన్నికల ముందు రెవెన్యూ సిబ్బందితో ఇంటింటా పరిశీలన చేయిస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

నర్సరీ రైతులకు రాయితీపై షేడ్‌నెట్స్

కడియం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నర్సరీ రైతులకు రాయితీపై షేడ్‌నెట్స్ అందుబాటులో ఉంచామని నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, పాలకవర్గ సభ్యులు తెలిపారు. కంపెనీ ధరలకే రైతులకు షేడ్ నెట్స్ అందిస్తామన్నారు. రైతులకు అవసరమైన 90శాతం, 75శాతం షేడ్‌నెట్స్ నర్సరీ సంఘం ఆఫీస్ షాపుల వద్ద అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

‘పేరాబత్తుల’ విజయం ఖాయం: గోరంట్ల



తొర్రేడులో ఎన్నిక ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖాయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ హెల్త్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్, పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. దీనిలో భాగంగా ఓటర్లను స్వయంగా కలిసి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసి వ్యవస్థలను నాశనం చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రాన్ని గాడిలో పెడుతుందన్నారు. తొర్రేడులో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్, మన్యం నరేంద్రనాథ్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఇంటికి వెళ్లి పేరాబత్తులకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, శివకుమార్, బి.రామారావు, దండమూడి ప్రమీల, బిక్కిన సాంబశివరావు, దండమూడి బాపినీయుడు, దొరబాబు, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘పేరాబత్తుల’ను గెలిపించుకుందాం
ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వంలోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం గోపాలపురంలో ఆయన పట్టభద్రులతో మాట్లాడారు. అనంతరం కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలంటూ పట్టభద్రులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, ఎమ్మెల్సీ యూనిట్ ఇన్‌చార్జ్ ఉండవల్లి దుర్గా ప్రసాద్, పడమట శ్రీనివాస్, కూనపం ప్రసాద్ బాబు, మద్దిపాటి రమేష్, వడ్లమూడి రమేష్, బాలిన రాము, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం



ఎస్టీ రాజాపురంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న నాగలత

డీఎల్‌పీవో నాగలత ఎస్టీ రాజాపురంలో పర్యటన

రంగంపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చేయి చేయి కలుపుదాం చెత్త నుంచి సంపద సృష్టిద్దాం అని డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఎస్టీ రాజాపురం గ్రామంలో విస్తరణాధికారి పి.వెంకటరత్నంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలతో మాట్లాడారు. మండలంలో 12 చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) పనిచేస్తున్నాయని అందులో ఐదు కేంద్రాల్లో వానపాముల ఎరువు తయారీ జరుగుతుందని, మిగిలిన ఏడు కేంద్రాల్లో కూడా వాన పాముల ఎరువుల తయారీ ప్రారంభిస్తామని, ప్రజలందరూ సహకరించి తడిచెత్తను, పొడిచెత్తను విభజించి తడిచెత్తను పంచాయతీ సిబ్బందికి అందజేసి సేంద్రీయ ఎరువు తయారీకి సహకరించాలని డీఎల్‌పీవో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఈ రెండు రోజులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించారన్నారు. తడిచెత్తను, పొడిచెత్తను వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందజేయలన్నారు. గ్రామాల్లో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు, వర్మీ కంపోస్ట్ తయారీపై ప్రజల్లో అవగాహన కల్పించామని నాగలత చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దినేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకుందాం

» గౌడ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో రాష్ట్ర అధ్యక్షుడు వాకా
» జిల్లా అధ్యక్షుడిగా మార్గాని



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గౌడ సామాజిక వర్గీయులంతా ఐకమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలని సంఘం రాష్ట్రాధ్యక్షుడు వాకా రామగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హోటల్ శ్రీకన్యలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత సంఘం నూతన అధ్యక్షుడిగా మార్గాని సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా సీటీ ఆర్‌ఐ విశ్రాంత శాస్త్రవేత్త మన్నెం సన్నిబాబు, ఉపాధ్యక్షుడిగా మార్గాని ఆదినారాయణ, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడిగా తాళం శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడిగా ఆర్‌వీవీ సత్యనారాయణ, రాజానగరం అధ్యక్షుడిగా బుడ్డిగ అప్పారావు, అనపర్తి అధ్యక్షుడిగా భీమన ఛత్రపతి శివాజీ, నిడదవోలు అధ్యక్షుడిగా ఎంవీవీ సత్యనారాయణ,కొవ్వూరు అధ్యక్షుడిగా బుర్ర కృష్ణ, గోపాలపురం అధ్యక్షుడిగా బల్లం దుర్గారావులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రామగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా నూతన కార్యవర్గం ఐక్యతతో ఉండి క్షేత్ర స్థాయిలో కమిటీలు నిర్మించుకోవాలని, వాటి ద్వారా జన సంఖ్య నమోదు చేసి గౌడ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని మార్గాని అన్నారు. సన్నిబాబు రచించిన గౌడగీత పుస్తకాన్ని ఈ సందర్భంగా రామగోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాతా కృష్ణారావు గౌడ్, రాజులపాటి శివప్రసాద్, కళ్యాణి, వేములవెంకటాచలం గౌడ్, తాతా శ్రీనివాసరావు గౌడ్, బాలిన అరవరాజు గౌడ్, అత్తిలి రాజు, కొండేపూడి భీమారావు, మార్గాని చంటి, కోమలి కిషోర్ గౌడ్, మారిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా!

ధవళేశ్వరంలో శ్రమదానంతో రోడ్లపై ఇసుకను తొలగించిన యువత



ధవళేశ్వరంలో రోడ్డుపై ఇసుకను తొలగిస్తున్న యువత

ధవళేశ్వరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ర్యాంపుల నుంచి అధిక ఇసుక లోడుతో వస్తున్న వాహనాల నుంచి జారి పడుతున్న ఇసుకలో ద్విచక్రవాహనదారులు జారి పడి అనేక ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. లారీల్లో అధిక లోడు చేయకుండా చర్యలు తీసుకోకపోవడం, పంచాయతీ, కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది రోడ్లపై పేరుకుపోతున్న ఇసుకను తొలగించడం లేదు. దీంతో ధవళేశ్వరంలో యువత నడుం బిగించి క్వార్యర్‌బోర్డు సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను తొలగించారు. కలెక్టర్ కార్యాలయం కూత వేటు దూరంలో ఉన్నా ఇసుక లారీల ఓవర్‌లోడ్, లారీలపై ఎటువంటి బరకాలు కప్పకుండా ఇష్టానుసారంగా ఇసుక తరలింపు వంటి వాటిపై చర్యలు చేపట్టకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంటెద్దు స్వామి, గుజ్జల సూర్యనారాయణ, తలాటం సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష ఉందని.. ట్రాఫిక్ పర్యవేక్షణ



ట్రాఫిక్‌జామ్ ఏర్పడకుండా పర్యవేక్షిస్తున్న పోలీసులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : జాతీయరహదారిపై దివాన్‌చెరువు సెంటర్‌లో ట్రాఫిక్‌జామ్ ఏర్పడకుండా బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథం ఆదివారం వాహన రాకపోకలు నిలువకుండా స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కాకినాడ జిల్లా పరిధిలోని కేంద్రాల్లో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష జరుగనుందని, ఈ నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకుని విలువైన వారి సమయాన్ని వృథా కాకుండా చూసేందుకు ముందుజాగ్రత్త చర్యగా వాహన రాకపోకలు నిలువకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయరహదారిపై అంతటా ఈ విధమైన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. దివాన్‌చెరువు జంక్షన్‌లో ట్రాఫిక్‌ను సీఐతోపాటు ఎస్ఐ రమేష్, బొమ్మూరు, ట్రాఫిక్ పోలీస్‌లు పర్యవేక్షించారు.

నేటి నుంచి ధ్యాన జ్ఞాన మహోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మర్షి పత్రీజీ దివ్యఆశయాలతో స్వర్ణమాల పత్రి అమ్మ ఆధ్వర్యంలో సుదర్శన చక్రం,ధ్యానం,యాగం మహోత్సవాలను సోమవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు పత్రీజీ మహిళా చైతన్య కమిటీ ప్రతినిధులు శైలజ,సుష్మ తెలిపారు. గౌతమి ఘాట్ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ఘాట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. శ్వాస మీద దృష్టి నిలిపి ధ్యానం చే స్తే ఆరోగ్యం, ఆనందం పొందుతామన్నారు. కార్యక్రమంలో లలిత, నాగవల్లి, సూర్యకళ, దివాన్‌జీ పాల్గొన్నారు.

వెంకటనగరం వీఆర్వో మృతి



రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరం వీఆర్వో మురళీకృష్ణ(49) ఆకస్మికంగా మృతిచెందారు. శనివారం రాత్రి అనారోగ్యంగా ఉండడంతో నగరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చేరగా ఆదివారం ఉదయం మృతిచెందారు. కాగా మురళీకృష్ణ స్వగ్రామం ఆలమూరు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తహశీల్దార్ కుమార్, డీటీ చైతన్య, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ చందు, పలువురు వీఆర్వోలు ఆసుపత్రికి వెళ్లి మురళీకృష్ణ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మృతి పట్ల సంతాపం తెలిపారు.

మార్చి 8 వరకు
పీజీఆర్ఎస్ రద్దు: కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి పట్టబద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 8వ తేదీ వరకు ప్రతి సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ సెషన్‌లు రద్దు చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీ కోసం పోర్టల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు.

పల్లాలమ్మకు వెండి ఆభరణాల బహూకరణ



పల్లాలమ్మకు చేయించిన వెండి కడియాలతో లక్ష్మణ్-లక్ష్మి దంపతులు

కడియం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కడియపులంక గ్రామ దేవత పల్లాలమ్మకు బుర్రిలంక గ్రామానికి చెందిన నర్సరీ రైతు నాగిరెడ్డి లక్ష్మణ్-లక్ష్మీ దంపతులు 250 గ్రాముల వెండితో తయారు చేయించిన కడియాలు బహూకరించారు. వారి చేతులమీదుగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై ప్రయాణికులకు అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైంపై ఆర్టీసీ, రైల్వే ప్రయాణీకులకు ఆదివారం అవగాహన కల్పించినట్టు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ జిల్లా ఇన్‌ఛార్జి కొమ్మిశెట్టి ఆదివరప్రసాద్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ క్రైం అంటే ఏమిటి, ఎలా భయడపెడతారు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే వాటిపై ప్రయాణీకులకు అవగాహన కల్పించామన్నారు. జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం అర్బన్ ఆర్గనైజర్ బల్ల హేమంత్ ముత్యాలు, రూరల్ మండల ఇన్‌ఛార్జి అన్నందేవుల సతీష్, రాజానగరం మండల ఇన్‌ఛార్జి అరవపల్లి సంతోష్‌కృష్ణ పాల్గొన్నారు.

నేడు పవర్ కట్

కోరుకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు.కోరుకొండ, ఫిల్మ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా ఉండదన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సూర్యప్యాలస్	: చావా
స్వామి	: బ్రహ్మాఆనందం
శివజ్యోతి	: రామం రాఘవం
అనుశ్రీ(సాయికృష్ణ)	: లైలా
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: రామం రాఘవం
రంభ	: బాపు
మేనక	: తల
అప్సర	: తండేల్
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అశోక	: జాబిలమ్మ నీకు అంత కోపమా
వీఎస్ మహల్(నామవరం)	: తండేల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తండేల్
వెంకటసూర్య(కడియం)	: ---
సత్యగౌరి (అనపర్తి)	: రామంరాఘవం
సూర్యశ్రీ (అనపర్తి)	: ----
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
రామకృష్ణ(కోరుకొండ)	: తండేల్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తండేల్
శ్రీనివాస (గోకవరం)	: తండేల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: రామంరాఘవం
లలితామహల్(రంపచోడవరం)	: తండేల్
నవయుగ(చింతూరు)	: తండేల్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025 | 5




నీ వెంటే.. నేనమ్మా..

అద్వితీయంగా రాయండి!


ఆల్ ది బెస్ట్..వదలొద్దు

ఆల్ ది బెస్ట్.. పరీక్ష బాగా రాయాలమ్మా.. వదలొద్దు ఒక జాబ్ మనదే కావాలి.. కంగారుపడొద్దు పరీక్ష జాగ్రత్తగా రాయండి.. తదితర మాటలు గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద వినిపించాయి.. కనిపించాయి.. ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఆదివారం కాకినాడలో గ్రూప్ పరీక్షలు నిర్వహించారు.. 9,379 మంది అభ్యర్థులకు 8,167 మంది పరీక్ష రాశారు...

దివాన్‌చెరువు ఫ్లయ్ ఓవర్‌కు లైన్ క్లియర్

రాజమహేంద్రవరంఅర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను-కొవ్వూరు-గామన్ ఇండియా వంతెనలను కలుపుతూ దివాన్‌చెరువు సెంటర్‌లో ఫ్లయ్ ఓవర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గామన్ వంతెన జంక్షన్-దివాన్ చెరువు జంక్షన్-ఫ్రూట్స్ మార్కెట్ సెంటర్‌ను కలుపుతూ ఈ ఫ్లయ్ ఓవర్‌ను నిర్మించనున్నారు.రూ.327 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం రూ.2.55 కిలోమీటర్లు నిర్మించనున్నారు.ఈ మేరకు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అనుమతులు మంజూరు చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్లయ్ ఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. మార్చిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రూ.10 లక్షలు హాంఫట్!

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం టి.నగర్‌కి చెందిన ఆదిత్య శ్రీకాంత్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. గత డిసెంబరు నెలలో టెలిగ్రాం ద్వారా ఓ ఫైనాన్స్ కంపెనీ లింక్ వచ్చింది. తమ వద్ద పెట్టుబడి పెడితే రెట్టింపు సొమ్ము వస్తుందని నమ్మించారు.దీంతో శ్రీకాంత్ రూ.10లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆ కంపెనీ యాప్ పని చేయడంలేదని, తాను మోసపోయానని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి తెలిపారు.

అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భో..ఫోర్స్ కుంభకోణం అంత పెద్ద కుంభకోణం జరుగుతోంది.. ఇది ఈ నాటిది కాదు.. చాలా ఏళ్లుగా వేళ్లూనుకుపోయింది.. అయినా ఏ ఒక్కరూ దీనిపై దృష్టి సారించినవారే లేరు.. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందించే సౌకర్యాలపై చేపట్టిన ఐవీఆర్‌ఎస్ సర్వేలో చివరి స్థానానికి చేరడంతో అందరి దృష్టీ ఈ ఆలయంపై పడింది.. ఇది జిల్లాకు మాయని మచ్చగా మారింది.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' నిఘా పెట్టగా అసలు విషయం బయటపడింది.. తవ్వితే బోఫోర్స్ కుంభకోణం అంతగా ఉంది.. ఇదిలా ఉండగా ర్యాంక్ మెరుగుపరిచేందుకు అన్నవరం ఆలయంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం అన్నవరం ఆలయంలో సమీక్షించేందుకు సిద్ధమయ్యారు.

అన్నవరంలో.. బో..ఫోర్స్!



4 ప్రధాన విభాగాల్లో దోపిడీ

- కంటున్నావా.. సత్యదేవా
- ఐవీఆర్‌ఎస్ సర్వేలో చివరి స్థానం
- లోపమెక్కడని ఆంధ్రజ్యోతి ఆరా
- దోచుకుంటున్న దళారులు
- దర్శనమైనా..గదులైనా డబ్బులే
- మామూళ్ల మత్తులో అధికారులు
- నేడు కలెక్టర్ సమీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పనిచేసే సిబ్బందిలో చాలా మంది తమ జేబులు నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అర్చకుల నుంచి క్యూలైన్‌లో నిలబెట్టేవారు వరకూ అందరూ చేయి చాపేవారే. చేయి తడిపితేనే దర్శనం చేయించేంతగా అవినీతి వేళ్లూనుకుపోయింది. అన్నవరం వచ్చిన భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారనే విమర్శలున్నాయి. మిగిలిన ఆలయాల్లో భక్తులు పరోక్ష దోపిడీకి గురవుతుండగా రత్నగిరికి విచ్చేసిన భక్తులు ప్రత్యక్ష దోపిడీకి గురికావడమే చివరి ర్యాంక్‌కు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం దళారీ వ్యవస్థ. ఎక్కడికక్కడే దళారులు కొంత మంది సిబ్బందితో కుమ్మక్కై భక్తులను దోచుకు తింటున్నారు. సిబ్బంది కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం జరిగే సమీక్షలో అవలోకనం చేస్తే భక్తులు సంతృప్తి చెందవచ్చు. ఇక్కడ భక్తులు ప్రత్యక్షంగా దోపిడీకి గురవుతున్నది నాలుగు విభాగాల్లో మాత్రమే.

1 దళారీ..దేముళ్లు!

స్వామివారి దర్శనాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటైన ఈ విభాగంలో దళారీ వ్యవస్థదే కీలక పాత్ర. రత్నగిరికి కార్లలో వచ్చే భక్తులనే దళారులు టార్గెట్‌గా పెట్టుకుంటారు. కారు పార్కింగ్ చేయగానే మీకు నేరుగా దర్శనం చేయిస్తామని, గర్భగుడిలో అర్చకులతో మెడలో పూలమాల వేయిస్తామని బేరసారాలు జరుపుతారు. ఒక్కొక్కరి వద్ద రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు లాగేస్తారు. బేరమయ్యాక దళారులు ఎన్‌ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఫోన్ చేస్తారు. భక్తబృందాన్ని వారికి అప్పగిస్తారు. దర్శనం అయ్యాక ఎన్‌ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగి డబ్బులను పంచుకుంటారు. ఈ తతంగమంతా సెక్యూరిటీ సిబ్బందికి తెలిసినా... వారు దళారీలతో ముచ్చటిస్తూ ఇంటికెళ్లే సమయంలో వారికి కొంత భాగమిస్తారు.ప్రకాష్ సదన్ కాటేజీ నుంచి పశ్చిమ రాజగోపురం వరకు అటూ ఇటూ దళారులు తిరుగుతూనే ఉంటారు.

2 చేయితడిపితేనే.. వ్రతఫలం

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తుల్లో అధిక శాతం స్వామివారి వ్రతాలు చేస్తారు. సామాన్యుల వ్రతం టిక్కెట్టు ధర రూ.300 అయితే పూర్తయ్యేసరికి మూడింతలు ఖర్చవుతుంది. టిక్కెట్టు రూ.300, వ్రతం పూజా సామగ్రి రూ.300, వ్రతం పూర్తయ్యాక పురోహితులకు దానాల రూపంలో స్వీకరించేది మరో రూ.300. ఇది కాకుండా వ్రతం అనంతరం శానిటేషన్ సిబ్బంది మూకుమ్మడిగా వ్రత మండపాల్లోకి వెళ్లి తాము స్వీపర్లమని యాచిస్తుంటారు. రత్నగిరి భక్తులు సగం ఛీత్కరించుకునేది ఇక్కడే.

3 ఛీ..ఆర్వో విభాగం

ఈ విభాగం కింద భక్తులకు వసతి గదులు కేటాయింపు జరుగుతుంది. పర్వదినాల్లో సాధారణ భక్తులకు కౌంటర్ గుమస్తాలు నరకం చూపిస్తారు. గదులు ఖాళీలు ఉన్నా సాధారణ భక్తుడికి గదులు ఇవ్వరు. అక్కడే ఉండే దళారులను సంప్రదించి కొంత అధిక మొత్తం చెల్లిస్తే మాత్రం వెంటనే గది దొరుకుతుంది. కేవలం రత్నగిరిపై 550 గదులు మాత్రమే ఉన్నాయి. సిఫార్సులు అధికం. దీంతో ఇక్కడ సామాన్య భక్తుడికి గది దొరకడం అసాధ్యం. ఇక్కడే వివాహ బృందాల దోపిడీకి దళారీ వ్యవస్థ కాచుకుని కూర్చుంటుంది. పురోహితుడు, సన్నాయిమేళం బేరం కుదుర్చుకుంటేనే వారికి లోపల ప్రవేశం ఉంటుంది. లేకుంటే అష్టకష్టాలే. దశాబ్దాలుగా ఇక్కడ దళారీ వ్యవస్థ వేళ్లూనుకుపోవడంతో ఎవరూ వారిని కదిలించలేకపోతున్నారు. వివాహ బృందాలకు స్వేచ్ఛ దొరకనివ్వకపోవడంతో దేవస్థానం అపఖ్యాతి పాలవుతోంది.

4 గలీజుల విభాగం!

భక్తుల సౌకర్యార్థం స్టాళ్లను ఏర్పాటు చేసే విభాగమే లీజుల విభాగం. దీన్ని సీ సెక్షన్‌గా పిలుస్తారు.ఇక్కడ దేవస్థానం నిర్దేశించే ధరలు అమలు జరగవు. ఉదాహరణకు సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు లైసెన్స్‌దారుడు ఒక్కో ఫోన్‌కు రూ.5 వసూలు చేయాలి ఇక్కడ రూ.10 వసూలు చేస్తాడు.ఇటీవల వినియోగదారుల కమిషన్ సైతం సదరు గుత్తేదారుపై జరిమానా వేసింది.మరోపక్క భక్తుల జోళ్ల జతకు రూ.2 వసూలు చేయాలి ఇక్కడ రూ.5 వసూలు చేస్తారు.పూజాసామగ్రి ధరలు, వివాహాలకు అవసరమైన డెకరేషన్ మండపాల ధరలు దేవస్థానం నిర్దేశించిన దానికంటే మూడింతలు ఎక్కువ.ఎక్కడా షాపుల వద్ద ధరల పట్టికలు ఉండవు. లీజుల విభాగం అధికారులు దీనిపై దృష్టిసారించరు. ఎందుకంటే మామూళ్ల మత్తు.ఎంఆర్‌పీ ధరలతో విక్రయాలు జరగవు. మామూళ్ల మత్తులో అధికారులు ఊగుతుండడం దౌర్భాగ్యంగా పేర్కొనవచ్చు.


చిత్రాడలో ఎస్‌బీ లే-అవుట్‌ను పరిశీలించి చర్చిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు

జనసేన ఫస్ట్ షో

- మార్చి 14న జనసేన ప్లీనరీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సమావేశం
- అధినేత పవన్ దిశానిర్దేశం
- చిత్రాడలో వేదిక ఖరారు
- ఒకే రోజు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న నేతలు

పిఠాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన ప్లీనరీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. మార్చి 14న జనసేన ప్లీనరీని పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించాలని ఇప్పటికే పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీ నూరుశాతం స్ట్రైక్‌రేట్‌తో అధికారంలోకి రావడం.. అధికారంలో భాగస్వామ్యమైన తర్వాత తొలి ప్లీనరీ కావడంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ ప్లీనరీకి ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి జనసైనికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.ఈ మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో 216వ జాతీయ రహదారి చెంతనే ఉన్న 80ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు లేఅవుట్ (ఎస్‌బీ సిటీ) జనసేన ప్లీనరీకి వేదిక కానుంది. ఉదయం ప్లీనరీ సమావేశాలతో పాటు సాయంత్రం ఇక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నారు.వాహనాల పార్కింగ్, వచ్చే నాయకులు, ముఖ్యఅతిథులు, కార్యకర్తలు భోజనాలు చేసేందుకు అనువైన ప్రాంతంగా దీన్ని గుర్తించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు జనసేనలోని ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. అక్కడ ఏ విధమైన ఏర్పాట్లు చేయాలన్న అంశంపై పార్టీ నాయకులు పరిశీలన జరిపారు. గతంలో మాదిరిగా మూడు రోజులు కాకుండా ఒకే రోజు ప్లీనరీ కావడంతో అక్కడే ఉదయం పార్టీ ప్రతినిధుల సమావేశం, సాయంత్రం బహిరంగ సభ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పార్టీ రాష్ట్ర నేతలు మరోమారు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.. ప్లీనరీ వేదికను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు,గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, రాజమహేంద్రవరం జనసేన అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ఇతర నాయకులు పరిశీలించారు. ప్లీనరీ, బహిరంగ సభల నిర్వహణ, వాహనాల పార్కింగ్ తదితరాలకు అక్కడ ఉన్న ప్రదేశం ఎంత వరకూ సరిపోతుందనే అంశంపై అంచనాలు వేశారు. నెలాఖరు లేదా మార్చి 1న పార్టీ ముఖ్యనేతలు పిఠాపురం వస్తున్నట్టు సమాచారం. వీరు వచ్చి పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకున్న తర్వాత ఏర్పాట్లు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని రాజమహేంద్రవం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. రాజమహేంద్రవరంలో కేంద్ర బడ్జెట్‌పై ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం పాల్గొన్నారు.కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. దీనిపై పురందేశ్వరి స్పందిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల ఎన్నో కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. ఇవన్నీ కొనసాగాలంటే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలి

రైతులకు ఢిల్లీరావు సూచన

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ కాస్తో కూస్తో ప్రకృతి వ్యవసాయం చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి యాజమాన్య పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. వర్మి కంపోస్టు వినియోగించి పండిస్తున్న అరటి, బొప్పాయి, చెరకు, నువ్వులు, మొక్కజొన్న పంటలను చూశారు.ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, కోఆర్డినేటర్ తాతారావు, జిల్లా హార్టికల్చర్ అధికారి పి.సుజాతకుమారి, వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

గోదారమ్మ ఎక్కడ.. శివయ్యా!



అధికారులు గత నెల రోజులుగా శివరాత్రిపై సమీక్షలు చేస్తున్నారు.. అయితే నేటికీ ఏర్పాట్లు మాత్రం చేయలేదు.. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' గోదావరి రేవులను పరిశీలించగా ఇలా అధ్వానంగా దర్శన మిచ్చాయి.. ఇక ఏర్పాట్లు ఎప్పుడు.. ఎలా చేస్తారో చూస్తారో చూడాల్సిందే మరి..!

రేవులు చూస్తే ఇలా.. ఏర్పాట్లు లేవే అసలా?

- ఎల్లుండే మహా శివరాత్రి
- అధ్వానంగా గోదావరి రేవులు
- అధికారులు చూసినా ఇంతే
- రేవుల చెంత కానరాని నీళ్లు
- లోపలకు దిగితేనే స్నానాలు
- మురికిగా కనిపిస్తున్న ఘాట్లు
- రాజమండ్రి,కొవ్వూరులో ఇంతే
- ఏర్పాట్లకు నిధుల్లేవట?
- భక్తులకు తప్పని ఇబ్బందులే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

శివ..శివా.. ఎంత కష్టం వచ్చింది.. రేవు లేదు.. ఎల్లుండే శివరాత్రి.. రేవులు చూస్తే శివరాత్రికి గోదావర్రీ తప్పేటట్టు లేదు..ఎందుకంటే గోదావరి రేవులు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి.. మెట్ల దగ్గరగా కూడా నీళ్ల లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.కొన్ని చోట్ల మాత్రం రేవుల అపరిశుభ్రంగా ఉన్నాయి. శివరాత్రికి గోదావరి స్నానం చేసి స్వామి దర్శనం చేసు కోవాలనేది భక్తులు నమ్మకం. అయితే శివరాత్రికి అఖండ గోదావరిలో స్నానమాచరించే పరిస్థితి కానరావడం లేదు.శివరాత్రికి జిల్లాలోని రాజమహేంద్రవరంలో ఉన్న కోటిలింగాల ఘాట్, పుష్కర ఘాట్, గౌతమిఘాట్, ధవళేశ్వరం రామ పాదాల రేవులకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. కోటి లింగాల ఘాట్‌కు ముందు రోజు రాత్రి అంటే మంగళవారం రాత్రి నుంచి దూర ప్రాంతాల భక్తులు కాలినడకన చేరుకోవడం ఆనవాయితీ..ఆ రోజున ఈ రేవులో సుమారు లక్ష మంది వరకూ స్నానాలు ఆచరిస్తారు. శివరాత్రి రోజున పుణ్య స్నానాలకు ఎంత ప్రాముఖ్యం ఉందో..పిండప్రదానాలకూ అంతే ప్రాధాన్యం ఉంది. అయితే.. కోటిలింగాల ఘాట్, గణపతి, దుర్గ, పుష్కర, మార్కండేయ, దోబీ, వీఐపీ ఘాట్లలో ఎక్కడా నదిలో స్నానం చేయడానికి అనుకూలంగా నీళ్ల లేవు. కొన్ని ఘాట్లలో అసలు నదిలో కాలు పెట్టడానికి లేకుండా నాచు పేరుకుపోయింది. గత పుష్కరాలకు దేశంలోనే అతి పెద్దదిగా కోటిలింగాల ఘాట్‌ను 1500 మీటర్ల నిడివితో విస్తరించారు. కానీ ఇక్కడ కూడా ఇప్పుడు నదిలో స్నానం చేసే పరిస్థితి లేదు. నదిలో బురద పేరుకుపోవడంతో అసలు కాలు పెట్టడానికి వీల్లేకుండా ఉంది. దీంతో మెట్లపైన జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారమే శివరాత్రి అయినా నేటికీ ఏర్పాట్లు పూర్తి కాలేదు.ఘాట్లలో సౌకర్యాలను కార్పొరేషన్ చేస్తుండగా, భద్రతాపరంగా పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది. కార్పొరేషన్, పోలీస్ వద్ద ఉన్న డ్రోన్లను రంగంలోకి దింపుతున్నారు. ఇప్పుడు శివరాత్రికి చేసే ఏర్పాట్ల అనుభవం పుష్కరాలకు పని చేస్తుందని భావిస్తున్నారు. కానీ ప్రస్తుతం పుష్కరఘాట్ మినహా మరెక్కడా నదిలో స్నానం చేసే వీల్లేకుండా ఘాట్లు ఉన్నాయి. దీంతో ఏ మాత్రం ఏర్పాట్లతో అలసత్వం కనిపించినా తొక్కిసలాట జరిగే అవకాశం కూడా ఉంది.


రాజమహేంద్రవరంలో మురికిగా ఉన్న గోదావరి నీరు

అధ్వానంగా గోష్పాదక్షేత్రం

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు నాచుపట్టి ఉన్నాయి.శివరాత్రికి సుమారు 25 వేల మంది గోదావరి పుణ్యస్నానాలకు వస్తుంటారు.బుధవారమే శివరాత్రి అయినా ఇంకా ఏర్పాట్లు చేయలేదు..గోష్పాదక్షేత్రం ఆవరణ అధ్వానంగా ఉంది. గతంలో పచ్చదనంతో నిండి ఉండే రావిచెట్లు కొట్టేసిన తర్వాత క్షేత్రం కళోపోయింది.ఆ చెట్టు కింద ఉండే దేవతా విగ్రహాలు పక్షుల రెట్టలతో నిండిపోయాయి. కనీసం వాటిని పట్టించుకునేవారే లేరు..ఇక చెట్టు ఉండే దిమ్మకూడా ముక్కలైపోయింది.అధికారులు వస్తున్నారు. వెళుతున్నారు తప్పితే ఏర్పాట్లు ఏం చేస్తారనేది మాత్రం చెప్పడం లేదు..శనివారం ఆర్‌డీవో రాణి సుస్మిత ఘాట్‌ను పరిశీలించి వెళ్లారు. ఇక మిగిలింది రెండు రోజులే హడావుడిగా ఏం చేస్తారో చూడాల్సిందే..మెట్లపై పట్టిన నాచుని పూర్తిగా తొలగించి, ఇసుక వేయించాలని భక్తులు కోరుతున్నారు. క్షేత్రంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వశాఖల అధికారులు తమ వద్ద నిధులు లేవంటూ బదులివ్వడం కొసమెరుపు. ఉన్నతాధికారులు స్పందించి శివరాత్రికి నిధులు కేటాయించాల్సి ఉంది.


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అధ్వానంగా ఉన్న స్నానాలరేవు

పట్టిసీమకు గోదారి

సీతానగరం,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ వెళ్లి వీరేశ్వరుడిని దర్శించుకోవాలనుందా.. అయితే కొవ్వూరు మీదుగానే వెళ్లా ల్సిన అవసరం లేదు.. మరో దారి కదా ఉందండోయ్.. సీతానగరం మండలం వంగలపూడి ర్యాంపు నుంచి ప్రతీ ఏడాది దారి వేస్తారు. ఈ ఏడాది కూడా దారి వేశారు. ఈ ప్రయాణం చాలా ప్రత్యేకం.. ఏజెన్సీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ దారి గుండా వెళతారు. పూర్వం నుంచి గోదారి ఉంది. నేటికీ అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఏలూరు జిల్లా పట్టిసం వీరభద్రుడిని దర్శించుకోవాలనుకేనే భక్తుల కోసం గోదావరి పాయకు అడ్డంగా ఇసుకతో రోడ్డు వేస్తున్నారు.వంగలపూడి ర్యాంపు మీదుగ అక్కడికి చేరుకోవచ్చు.


వంగలపూడి నుంచి పట్టిసీమకు గోదావరిలో ఇసుకతో ప్రత్యేకంగా వేస్తున్న దారి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

డీపీవో శాంతమణి



సమిశ్రగూడెంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో శాంతమణి

నిడదవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి శాంతమణి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆదివారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనుల ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థులు పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి చెత్త అందిచేటప్పుడు తడిచెత్తను, పొడిచెత్తను వేరువేరుగా అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా చూసుకోవచ్చని శాంతమణి అన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో అమ్మాజీ, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజూ శానిటేషన్‌పై డ్రైవ్ నిర్వహించారు. తాళ్లపూడిలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించినట్టు గ్రామ కార్యదర్శి, ఈవోపీఆర్డీ వీరన్న తెలిపారు. తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా ఉంచాలని, పారిశుధ్య సిబ్బంది వచ్చినపుడు విడివిడిగా అందించాలని చెప్పారు.



తాళ్లపూడిలో తడి, పొడి చెత్తపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు క్షీర, మహానివేదన జరిపారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవారి దర్శనం కలుగజేశారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాదం, పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.93,839 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

హౌసింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చక్రవర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణ ఏఈ కేఎస్ చక్రవర్తి నియమితులయ్యారు. రాజమహేంద్రవరం డివిజన్ గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో ఆదివారం రెగ్యులర్, ఎస్ఎంఆర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కార్యవర్గ ఎన్నికలు బీవీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా చక్రవర్తి, జాయింట్ సెక్రటరీగా కొవ్వూరు మండల ఏఈ డీఎస్ చాంబర్లీన్ నియమితులయ్యారు. సెక్రటరీగా బీవీవీ సత్యనరారాయణ మూర్తి, ఉపాధ్యక్షులుగా సూరిబాబు, ఎన్ఆర్‌వీ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా-2గా ఎం.అన్నపూర్ణ, కన్వీనర్లుగా ఎన్.రఘు, జి.శ్రీనివాసరావు, మరో ఎనిమిది మంది కార్యవర్గసభ్యులుగా నియమితులయ్యారు. సమావేశంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులపై పనిభారం తగ్గించడం, సమస్యలపై సమష్టి పోరాటం చేయాలని తీర్మానించారు.కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఇజ్జిన చినబాబు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్' సమస్యలు పరిష్కరించాలి

జేఏసీ రాష్ట్ర చైర్మన్ వెంకటరత్నం
ఎమ్మెల్యే ముప్పిడికి వినతి



ఎమ్మెల్యే ముప్పిడికి వినతిపత్రం ఇస్తున్న వెంకటరత్నం

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేఏసీ రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటరత్నం డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 24 నుంచి జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారన్నారు. వెంకటరత్నం మాట్లాడుతూ ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఎత్తివేసి మరలా ఏజెన్సీ వ్యవస్థను తీసుకొస్తామని నిర్ణయం తీసుకోవడంతో ఉద్యోగులంతా భయాందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో 3,50,000 మందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, టైం స్కేలు అమలు చేయాలని, సీనియారిటీ ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే కారుణ్య నియామకాలు చేపట్టాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పొడిగించాలని, సక్రమంగా పీఎఫ్, ఈఎస్‌ఐ అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దండ నాని, సుంకవల్లి హరికృష్ణ, మర్రి సుబ్రహ్మణ్యం, అన్నెం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

ఎన్నికల ప్రచారంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాఘవులు

కొవ్వూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, నిరుద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులను గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమా మహేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరులో గ్రాడ్యుయేట్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొద టి ప్రాధాన్య ఓటు రాఘవులు కు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలను కాపాడడంలో 18 ఏళ్లుగా పీడీఎఫ్ అభ్యర్థులు విశేష కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన ఉద్యోగ, కార్మిక సంఘాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభు త్వ శాఖలలో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం, పీఆర్సీ సకాలంలో అమలు చేయడం లేదన్నారు. చంద్రబాబు మొదటి సంతకం డీఎస్సీకే నేటికీ దిక్కు లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, జువ్వల రాంబాబు, బీర రవి, పి.చిన్నబాబు, ఎం.జ్యోతీబసు, పి.గంగాధర రావు, డి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 ఆదివారాల హనుమాన్ చాలీసా పారాయణం



నిడదవోలులో చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

నిడదవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హనుమాన్ చాలీసా నిత్య పారాయణం చేయడం వల్ల ప్రతి ఒక్కరికి మానసిక శారీరక దృఢత్వం కలుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రతినిధి గోవర్ధం శ్రీనివాసమూర్తి అన్నారు. ఆదివారం నిడదవోలులోని కందకట్ల శ్రీనివాస్ ప్రసాద్ నివాసంలో శ్రీ రామదూత హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో 108 ఆదివారాల హనుమాన్ చాలీసా పారాయణం 108 సార్లు చేసే కార్యక్రమం ప్రారంభించారు. హనుమంతుడికి విశేష పూజలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ హిందువులకు హనుమంతుడు భక్తి, ధైర్యం అంకితభావం ఆదర్శనీయమన్నారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాల రామలింగేశ్వరుడి కల్యాణం

చాగల్లు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆదివారం వేడుకగా జరిగింది. ఆలయంలో శివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించి కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం కాపవరం గాంధీబొమ్మ వద్ద ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. ఆదివారం గౌరీపట్నం నుంచి బైక్‌పై అనపర్తి వెళ్తున్న యువకుడిని ఆటో వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి బలంగా గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'పేరాబత్తుల'ను గెలిపించండి

తాళ్లపూడి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేటలో యువగళం టీం ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. గ్రాడ్యుయేట్లు తమ మొదటి ప్రాధాన్య ఓటును కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబానికి 'యువగళం' పరామర్శ

తాళ్లపూడి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేవం గ్రామంలో న్యాయవాది తిగిరిపల్లి సుబ్బారావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం యువగళం టీం, కూటమి నాయకులు సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్, జగన్, మద్దుకూరి శంకరం, ఉప్పులూరి రమేష్, నామా నరేంద్ర, తిగిరిపల్లి కనకరత్నం తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ గొడౌన్ మేనేజర్‌పై కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ నుంచి అక్రమంగా బిల్లులు లేకుండా రూ.7,14,731 విలువైన పేయింట్స్ తరలించడంపై గొడౌన్ మేనేజర్‌పై కేసునమోదు చేసినట్టు సీఐ పివిశ్వం తెలిపారు. స్థానిక ఏషియన్ పేయింట్స్ గొడౌన్ నుంచి గత నెల 25వ తేదీ రాత్రి గొడౌన్ మేనేజర్ పొంగుటూరు మండలం ఇందుపల్లికి చెందిన మూసిముక్కు భార్గవ్ యుగంధర్ 20 లీటర్ల పరిమాణమున్న 20 డ్రమ్ములు బిల్లులు లేకుండా క్రాంతి ట్రాన్స్‌పోర్టుకు రవాణా చేశారు. అనంతరం నిర్వహించిన ఆడిట్‌లో అసలు విషయం బయటపడడంతో గొడౌన్ మేనేజర్‌పై ఆడిట్ బృందం సభ్యుడు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కోటగిరి నవీన్‌కుమార్ ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

కొవ్వూరులో బంగారం చోరీ

కొవ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులోని ఓ దొంగలు పడి బంగారు వస్తువులు దొంగిలించుకుపోయినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణంలోని వేగివారిచావిడిలోని ఉపాధ్యాయుడు కాపెల్లి గనిరాజు ఈ నెల 22న కుటుంబసభ్యులతో నిడదవోలు వివాహానికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లో బీరువా తలుపులు తెరచి వస్తువులు చిందర వందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సుమారు రూ.2.15 లక్షలు విలువైన 115 గ్రాముల విలువైన బంగారు వస్తువులను దుండగులు అపహరించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ పి.విశ్వం పరిశీలించారు.

నేటి నుంచి సుందరేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఈనెల 24 నుంచి 28 వరకు శివరాత్రి (సుందరేశ్వరస్వామి కల్యాణం) ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ సీఎఫ్‌వో వి.శ్రీకృష్ణదేవి తెలిపారు.ఆలయా ర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి, సుందరగణేష్ మాట్లాడుతూ ఈ నెల 24న బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరుడి కల్యాణం, 25న బలిహరణం, సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సామూహిక రుద్ర, పంచామృత అభిషేకాలు, 28న పూర్ణాహుతి, వసంతోత్సవం, ఊంజల్‌సేవ జరుగుతాయని పేర్కొన్నారు.

'పేరాబత్తులను గెలిపించుకుందాం'



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి తదితరులు

గోపాలపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వంలోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం గోపాలపురంలో ఆయన పట్టభద్రులతో మాట్లాడారు. అనంతరం కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలంటూ పట్టభద్రులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, ఎమ్మెల్సీ యూనిట్ ఇన్‌చార్జ్ ఉండవల్లి దుర్గా ప్రసాద్, పడమట శ్రీనివాస్, కూనపం ప్రసాద్ బాబు, మద్దిపాటి రమేష్, వడ్లమూడి రమేష్, బాలిన రాము, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మోర్త గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి, అనంతరం నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌సీ ఎన్నికల జిల్లా పరిశీలకుడు బూరగడ్డ వేద వ్యాస్, నియోజకవర్గ పరిశీలకుడు దాసరి వీర వెంకటసత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతపల్లి హైస్కూల్‌లో 1979-80లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

నల్లజర్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అనంతపల్లి, పోతవరం హైస్కూల్స్‌లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. అచ్చన్నపాలెం, పోతవరం కల్యాణ మండపాలు పూర్వ విద్యార్థులతో కళకళలాడాయి. కుటుంబ సభ్యులతో హాజరై అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో వారంతా సహపంక్తి భోజనాలు చేశారు. పోతవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు అబ్బూరి ప్రసాదరావు, ప్రతిపాటి కృష్ణ, కే.వెంకట రమణ, గద్దె జనార్దన, అనంతపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు తాళ్లూరి సత్యనారాయణ,చందూరి రామకృష్ణ, ఆలపాటి పద్మవాణి, రావూరి శ్రీనివాస్, సత్యమోహన్, మద్దిపాటి రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మలగిరి అన్నదాన కేంద్రం వద్ద కూలింగ్ వాటర్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్

దేవరపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో వేసవి దృష్ట్యా చల్లని నీరు అందించడానికి కూలింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభించామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ అన్నారు. దేవరపల్లి మండలం నిర్మలగిరి పుణ్య క్షేత్రంలో అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు తన భార్య లలిత పేరు మీద కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని కల్లే నాగేశ్వరరావు తెలిపారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ భక్తులకు రుచికరమైన ఆహారం అందజేయడంతో పాటు కూలింగ్ వాటర్‌ను అందించాలనే ఉద్దేశంతో కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను సొంత ఖర్చులతో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో దిరిసిన ఫాతిమా రాణి, శ్యామ్, శివ, అనీల్, అజయ్, సిస్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డీపీవో శాంతమణి

గ్రామాల్లో చెత్త సేకరణ విధిగా జరగాలి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింట చెత్త సేకరణ విధిగా జరగాలని జిల్లా పంచాయతీ అధికారిణి వి. శాంతమణి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాలంగి, మోర్త గ్రామాల్లో ఇంటింట చెత్త సేకరణ కార్యక్రమాన్ని కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీతో కలసి ఆమె పరిశీలించారు. ప్రజలకు చెత్త నుంచి సంపద తయారీ కేం ద్రాల వివరాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని డీపీవో శాంతమణి సూచించారు. పాలంగి, మోర్త గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ పనులను పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో డీఎల్‌పీవో అమ్మాజీ, ఈవోపీఆర్డీ కెఎస్ఆర్ శర్మ, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డీ హసన్‌జాని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

గోపాలపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గోపాలపురంలోని 259, 260, 261 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చినట్టు తహశీల్దార్ అజయ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రం లోపలి భాగంతో పాటు బయట ప్రదేశం కూడా చిత్రీకరించేలా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



దేవరపల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలిస్తున్న కార్యదర్శి రవికిశోర్

దేవరపల్లిలో స్పెషల్ శానిటేషన్

దేవరపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా ఆదివారం అన్ని వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్టు కార్యదర్శి ఎన్.రవికిశోర్ తెలిపారు. గ్రామంలోని చంద్రబాబు కాలనీ, ఎస్సీ ఏరియా, బీసీ కాలనీలోనూ చెత్త తొలగించటం, డ్రైనేజీ పూడికలు తీసే కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ రాజారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి పనులు పరిశీలించారు.

ఐక్యతతో హక్కులు సాధించుకుందాం

- గౌడ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో రాష్ట్ర అధ్యక్షుడు వాకా
- జిల్లా అధ్యక్షుడిగా మార్గాని



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గౌడ సామాజిక వర్గీయులంతా ఐకమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలని సంఘం రాష్ట్రాధ్యక్షుడు వాకా రామగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హోటల్ శ్రీకన్యలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత సంఘం నూతన అధ్యక్షుడిగా మార్గాని సత్యానారాయణ, గౌరవాధ్యక్షుడిగా సీటీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త మన్నెం సన్నిబాబు, ఉపాధ్యక్షుడిగా మార్గాని ఆదినారాయణ, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడిగా తాళం శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడిగా ఆర్‌వీవీ సత్యనారాయణ, రాజానగరం అధ్యక్షుడిగా బుడ్డిగ అప్పారావు, అనపర్తి అధ్యక్షుడిగా భీమన ఛత్రపతి శివాజీ, నిడదవోలు అధ్యక్షుడిగా ఎంవీవీ సత్యనారాయణ, కొవ్వూరు అధ్యక్షుడిగా బుర్ర కృష్ణ, గోపాలపురం అధ్యక్షుడిగా బల్లం దుర్గారావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రామగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా నూతన కార్యవర్గం ఐక్యతతో ఉండి క్షేత్రస్థాయిలో కమిటీలు నిర్మించుకోవాలని, వాటి ద్వారా జన సంఖ్య నమోదు చేసి గౌడ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని మార్గాని అన్నారు. సన్నిబాబు రచించిన గౌడగీత పుస్తకాన్ని రామగోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాతా కృష్ణారావు గౌడ్, రాజులపాటి శివప్రసాద్, కల్యాణి, వేముల వెంకటాచలం గౌడ్, తాతా శ్రీనివాసరావు గౌడ్, బాలిన అరవరాజు గౌడ్, అత్తిలి రాజు, కొండేపూడి భీమారావు, మార్గాని చంటి, కోమలి కిశోర్ గౌడ్, మారిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన యూనియన్ నాయకులు

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఉద్యోగులు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఏవీ కిరణ్, యూనియన్ జాతీయ అధ్యక్షుడు జేఎస్ పాటిల్ పేర్కొన్నారు. పెరవలి సెంటర్‌లో ఆదివారం జాతీయ రహదారిపై కొద్దిసేపు ఆగి యూనియన్ నాయకులు, సభ్యులతో మాట్లాడారు. ఐక్యంగా ఉండి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని వారు కోరారు. తొలుత తీన్‌మార్ డప్పులతో నాయకులు స్వాగతం పలికారు అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ కార్యదర్శి నీతిపూడి వెంకట్రావు, నిడదవోలు డివిజన్ అధ్యక్షుడు సుబ్బారావు, నరసాపురం డివిజన్ అధ్యక్షులు బి.నరేంద్రశ్రీనివాస్, ట్రెజరర్ కె.నాని, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొయ్యలగూడెం శ్రీఆరోగ్య ఆసుపత్రి ఎండీ కొల్లూరి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని హుకుంపేట గ్రామంలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 230 మందికి రక్తపరీక్షలు నిర్వహించి వాటితో పాటు ఈసీజీ, స్కానింగ్ పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్టు తెలిపారు. వారిలో 13 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి ఎన్టీఆర్ వైద్యసేవా పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నరహరశెట్టి సతీష్, గైనకాలజిస్ట్ భాగ్యలక్ష్మి, చిన్నపిల్లల వైద్యులు చక్రపాణి, ఎముకల డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్య చిత్రపటానికి నివాళి



చంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దేవరపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు కంటే బ్రిటీష్ వారిపై 50 ఏళ్ల ముందే పోరాటం చేసిన మన్యం వీరుడు ద్వారబంధాలయ చంద్రయ్య అని గోపాలపురం నియోజక వర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో ద్వారబంధాల చంద్రయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జనసేన నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాట్నం గణేష్, చప్పటి శివనాగప్రసాద్, నాని, చిన్ని, అనిశెట్టి మధు, జాజిమొగ్గల శ్రీనివాస్, సిద్ధా తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు హైస్కూలులో ఆదివారం 2012-13 సంవత్సరం టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు.